క్లుప్తంగా

కన్నంపేట వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



రాజీనామా లేఖలు చూపుతున్న కన్నంపేట గ్రామ వలంటీర్లు

రావికమతం: కన్నంపేట గ్రామానికి చెందిన 10 మంది వలంటీర్లు గురువారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను సచివాలయ కార్యదర్శికి అందించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్య పాలనకు శ్రీకారం చుట్టి వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన సేవలందించారన్నారు. తమపై అక్కసుతో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ నిత్యం నిందిస్తుండటమే కాక తన అనుయాయుల ద్వారా కోర్టులో పిల్ వేసి ప్రజా సేవకు దూరం చేశారన్నారు. దీంతో తామంతా మూకుమ్మడి రాజీనామాలు చేశామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

చీడికాడ: అప్పలరాజుపురం 33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు చీడికాడ ఏఈ వెంకటరావు గురువారం తెలిపారు. అప్పలరాజుపురం, ఖండివరం, శిరిజాం, కోనాం, మంచాల గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. వినియోగదారులు గమనించి ఈ అసౌకర్యానికి సహకరించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన



కుంకుమ పూజా కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ సూర్యనారాయణ, తదితరులు

కె.కోటపాడు: పాచిలవానిపాలెంలో నూతనంగా నిర్మించిన తలుపులమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవ, విగ్రహ ప్రతిష్ఠాపనా కార్యక్రమాలు రెండు రోజులుగా శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. అంపోలు ఉమామహేశ్వర శర్మ పర్యవేక్షణలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ కార్యక్రమాలను చేపడుతున్నారు. ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం యాగశాలలో కుంకుమార్చన, రుద్రహోమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణతోపాటు గ్రామపెద్దలు పాల్గొన్నారు. శుక్రవారం ఆలయ ప్రారంభోత్సవ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమానికి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

30న జాబ్‌మేళా

తుమ్మపాల: పట్టణంలోని డీమార్ట్ సమీపంలో గల శివ ఐటీఐ కళాశాలలో ఈ నెల 30న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కె.ఎస్.శివనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఫాక్స్ కాన్, స్కైగార్డ్ ఎలక్ట్రానిక్స్, భారత్ బయోటెక్, ఇన్ఫిలోమ్, పానాసోనిక్, డిక్సాన్, ఇసుజు మోటార్స్, కెఎస్‌హెచ్,హోండాయ్, మోబీస్, జయభేరి కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల వయస్సు లోపు నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని పేర్కొన్నారు. ఆయా ఉద్యోగాలను బట్టి నెలకు రూ.12 నుంచి రూ.16 వేల వరకు జీతం, ఇన్సెంటివ్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం కల్పిస్తారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30 వ తేదీ ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరింత సమాచారం కోసం 9247836912, 9440641267 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

వారపు సత వెలవెల



బోసిపోయిన వారపు సంత

కశింకోట: స్థానిక వారపు సంత గురువారం సూర్య ప్రతాపంతో బోసిపోయింది. ఉదయం ఎండ అధికంగా ఉండడంతో సంతకు రావడానికి ఎవరూ సాహసించలేదు. దీంతో కూరగాయలు, ఆకుకూరలు, మసాల దినుసులు, పండ్ల దుకాణాలు వెలవెలబోయాయి. ఎండ తీవ్రత భరించలేక దుకాణదారులు సమీపంలోని దుకాణాల వద్దకు చేరుకొని సేద తీరారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఎండ తీవ్రత తగ్గడం, తర్వాత మబ్బు వేసి వాతావరణం చల్లబడడంతో ప్రజలు యథావిధిగా సంతకు వచ్చి కొనుగోళ్లు చేశారు.

కోలాహలంగా అనురాధ నామినేషన్

- పార్టీ శ్రేణులతో కిక్కిరిసిన మాడుగుల
- అడుగడుగునా జననీరాజనం
- జై జగన్, జై బూడి, జై అనురాధ అంటూ హోరెత్తిన నినాదాలు
- తారువ నుంచి మాడుగుల ఆర్వో కార్యాలయం వరకు భారీ ర్యాలీ



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ



తారువ నుంచి మాడుగుల వస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణుల భారీ ర్యాలీ

మాడుగుల: ఊరూవాడా కదలి వచ్చిందా అన్నట్టుగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ నామినేషన్ కార్యక్రమ ర్యాలీ కోలాహలంగా సాగింది. మండుటెండను సైతం లెక్క చేయకుండా తమ అభిమాన నాయకురాలు వెంట మేము సైతం సిద్ధం అంటూ నడిచారు. జై జగన్.. జై బూడి.. జైజై అనురాధ నినాదాలు చేస్తూ.. దారి పొడవునా ఎంపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు, ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధకు పూల వర్షం కురిపించి కనీవినీ ఎరుగని రీతిలో ప్రజలు అఖండ స్వాగతం పలికారు. మాడుగుల పట్టణ వీధులు ఎక్కడ చూసినా జనంతో కిక్కిరిశాయి. ఒక పక్క, గిరిజన సంప్రదాయ నృత్యాలు థింసా, మహిళా కోలాటాలు, చిటికల భజనలు, ఆటపాటలు, డప్పులు, తీన్‌మార్ డ్యాన్స్‌లు, వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచార పాటలతో డీజే, మైక్ మోతలతో, నామినేషన్ కార్యక్రమం ఎంతో సందడిగా జరిగింది.

తొలుత దేవరాపల్లి మండలం తారువలో ప్రారంభమైన ర్యాలీ 30 కిలోమీటర్ల మేర సాగి ఘాట్‌రోడ్ జంక్షన్‌కు చేరుకుంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి తరలివచ్చిన 50 వేల మందికిపైగా పార్టీ శ్రేణులు, అభిమానులు వెంట రాగా, ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మను ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ దర్శించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులు తీసుకుని, అనంతరం తల్లిదండ్రులు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, రమణమ్మలకు పాదాభివందనం చేశారు. 50 ఏళ్ల చరిత్ర తిరగ రాసే దిశగా గెలుపే లక్ష్యంగా గురువారం స్థానిక రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ సమర్పించారు.

మాడుగుల కోటలో మూడో మహిళగా..

నియోజకవర్గ చరిత్రలో మొట్టమొదటి మహిళా ఎమ్మెల్యేగా మాడుగుల మహారాణి రమాకుమారి దేవ్, రెండో ఎమ్మెల్యేగా బొడ్డు కళావతి విజయం సాధించారు. మూడో ఎమ్మెల్యే అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడానికి ఈర్లె అనురాధ బరిలో దిగడంతో మహిళలంతా ఏకతాటి మీదకు వచ్చారనడానికి తాజా ర్యాలీయే తార్కాణంగా నిలుస్తోంది. జిల్లాలో ఏకైక మహిళా ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ గెలుపు ఖాయమని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

ప్రజలు ప్రక్షాన వైఎస్సార్ సీపీ: బూడి

ఓపెన్ టాప్ ప్రచార వాహనంపై ఎంపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ, ప్రజలకు అభివాదం చేశారు. నాలుగు మండలాల నుంచి తరలి వచ్చిన అశేష జనవాహిని ర్యాలీలో ముత్యాలనాయుడు మాట్లాడారు. ప్రజల పక్షాన నిలబడిన పార్టీ ఏదైనా ఉదంటే అది ఒక్క వైఎస్సార్‌సీపీయే అన్నారు. సంక్షేమ పథకాలు మరి కొంతకాలం కొనసాగాలంటే తమ పార్టీని గెలిపించాలని అభ్యర్థించారు. కూటమి అభ్యర్థులు మాయమాటలు చెప్పడానికి వస్తున్నారని, అవి నమ్మే స్థితిలో మాడుగుల ప్రజలు లేరన్నారు.

జనబలం– అదే మా బలం : అనురాధ

నాలుగు మండలాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన జన బలమే రేపు తన గెలుపునకు నిదర్శనమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ అన్నారు. ఒక కుటుంబ సభ్యురాలిగా మాడుగుల నియోజకవర్గం బిడ్డగా, అక్కగా చెల్లిగా ప్రజలకు దగ్గరగా ఉండి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మాడుగుల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానన్నారు. తన తండ్రి మాడుగులను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దారన్నారు. ఆ అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు కొనసాగడానికి తనను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడును, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపించాలని వేడుకున్నారు. మాడుగుల, చీడికాడ, కె.కోటపాడు ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, కురసా జయమ్మ, రెడ్డి జగన్‌మోహన్, ఆయా మండలాల అధ్యక్షులు వేమవరపు రామధర్మజ, గొల్లవిల్లి రాజబాబు, బూరె బాబూరావు, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, జెడ్పీటీసీలు కిముడు రమణమ్మ, లాలం శారదా జానకీరామ్, కర్రి సత్యం, మాడుగుల పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనువాసరావు, సర్పంచ్‌లు ఎడ్ల కళావతి, గొల్లవిల్లి సంజీవరావు, ఎంపీటీసీలు పాలిమేర విజయలక్ష్మి, షేక్ ఉన్నీషా పాల్గొన్నారు.



ర్యాలీలో మహిళల కోలాటం

తారువ నుంచి బయలుదేరి...

దేవరాపల్లి/కె.కోటపాడు/చీడికాడ/మాడుగుల రూరల్: దేవరాపల్లి మండలం తారువ నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు చేపట్టిన భారీ వాహన ర్యాలీ తిమిరాం, వాకపల్లి, చీడిపల్లి, పెగగోగాడ, జైతవరం, అప్పలరాజుపురం, కేజె పురం, ఘాట్ రోడ్డు జంక్షన్ మీదుగా మాడుగుల చేరుకుంది. ముందుగా తారువలో ఆరాధ్య దైవం మర్లమాంబను దర్శించుకుని పూజలు చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీలు చింతల బుల్లిలక్ష్మి, రొంగలి సూర్యనారాయణ, లెక్కల గోపి, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరదపురెడ్డి లలితానాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ, గండిపడాల అప్పలరాజు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

- ఎమ్మెల్యే స్థానానికి 8 మంది అభ్యర్థుల దాఖలు

చోడవరం: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల స్వీకరణ పర్వం గురువారంతో ముగిసింది. చోడవరం ఎమ్మెల్యే స్థానానికి 8 మంది అభ్యర్థులు వివిధ పార్టీల నుంచి 15 నామినేషన్ల సెట్లు వేశారు. వైఎస్సార్‌సీపీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ మూడు సెట్లు, ఆ పార్టీ డమ్మీ అభ్యర్థిగా ధర్మశ్రీ సతీమణి వెంకట విజయలక్ష్మి ఒక సెట్టు నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి జగతా శ్రీనువాసరావు, సీపీఐ ఎంఎల్ లిబిరేషన్ పార్టీ నుంచి సవరాల గణేష్ నామినేషన్లు వేశారు. చివరి రోజున టీడీపీ నుంచి కేఎస్‌ఎన్‌ఎస్ రాజు నాలుగు సెట్లు, ఆ పార్టీ డమ్మీ అభ్యర్థిగా గూనూరు మల్లునాయుడు ఒక సెట్టు వేశారు. ఇండిపెండెంట్, బీఎస్పీ తరపున వేగి మహాలక్ష్మినాయుడు రెండు సెట్లు, ఇండిపెండెంట్‌గా పేరిచెర్ల వేగిరాజు ఒక సెట్టు నామినేషన్లు వేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్నికృష్ణకు తెలిపారు.

మాడుగులలో 7 నామినేషన్లు

మాడుగుల: నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థులుగా 14 మంది 29 నామినేషన్లు వేశారు. ఆఖరి రోజు ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈర్లె అనురాధ, ఆ పార్టీ డమ్మీ అభ్యర్థిగా బూడి రమణమ్మ, టీడీపీ డమ్మీ అభ్యర్థిగా గవిరెడ్డి రామానాయుడు, స్వతంత్ర అభ్యర్థులుగా పైలా ప్రసాదరావు రెండు సెట్లు, లెక్కల ఈశ్వరరావు, కాంగ్రెసు పార్టీ అభ్యర్థిగా బొడ్డు శివ శ్రీనివాసరావు ఇక్కడ కార్యాలయంలో ఆర్వో సత్యవాణికి నామినేషన్లు సమర్పించారు.



ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ

మలేరియా నిర్మూలన మనందరి బాధ్యత



తురకలపూడిలో ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

బుచ్చెయ్యపేట: మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తురకలపూడి ప్రభుత్వ వైద్యాధికారి సంధ్యారాణి తెలిపారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా తురకలపూడిలో మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యాధి దోమ వల్ల వస్తోందని, ప్రజలు పరిసర ప్రాంతాల్లో మురుగు లేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా పొడిగా ఉంచడం వల్ల దోమలు జాడ ఉండదన్నారు. మలేరియా నిర్మూలన కోసం అన్ని రకాల మందులు ప్రభుత్వ ఆస్పత్రిల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. వైద్యాధికారి సునీల్ మాధవ్, ఫార్మసిస్టు మౌళి పాల్గొన్నారు.

రోలుగుంటలో ఘనంగా ప్రపంచ మలేరియా దినోత్సవం

రోలుగుంట: ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని గురువారం రోలుగుంటలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు కె.ధనలక్ష్మి, శ్రావణిల ఆధ్వర్యంలో వడ్డాది -నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ రోడ్డులో సాగిన ర్యాలీలో దోమలను నిర్మూలిద్దాం–దోమ ద్వారా వచ్చే వ్యాధులను నివారిద్దాం, నిల్వ నీటిని తొలగిద్దాం–దోమల వృద్ధిని అరికడదాం అంటూ నినదించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మలేరియాకు పూర్తి చికిత్స, పూర్తి రక్షణ అవసరమన్నారు. ఎంపీహెచ్‌ఈవో వై.కృష్ణ, ఎంపీహెచ్ఎస్ ఎస్.కె.షాజహాన్, పీహెచ్‌ఎన్ కె.సరస్వతి, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



వడ్డాది-నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ రోడ్డులో వైద్య సిబ్బంది ర్యాలీ

వేసవిలో పశుపోషణలో జాగ్రత్తలు

- పశువైద్యాధికారి నాయుడు

కె.కోటపాడు: వేసవిలో పాడి రైతులు పశు పోషణలో జాగ్రత్తలు పాటించాలని పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు తెలిపారు. గురువారం కొరువాడలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. 67 పశువులకు గర్భకోశ చికిత్సలతోపాటు సాధారణ వైద్యం అందించారు. 11 పెయ్యిలకు నట్టల నివారణ మందు అందించారు. ఈ సందర్భంగా పాడి రైతులకు పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పశువుల మేతకు ఉదయం 10 గంటలలోపు, సాయంత్రం 4 గంటల తర్వాత ఆరు బయటకు తీసుకెళ్లాలని సూచించారు. పశువులకు గాలి, వెలుతురు, నీడనిచ్చే ప్రాంతాల్లో మధ్యాహ్న సమయాల్లో ఉంచాలని తెలిపారు. రోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో పశువులను నీటితో శుభ్రపర్చడం వల్ల శరీరంలో ఉష్ణోగ్రతలు చల్లబడతాయన్నారు. పశుగ్రాసం సమస్య రాకుండా ఉండేందుకు ముందస్తుగా చర్యలను తీసుకోవాలని సూచించారు. ఈ పద్ధతులను పాటిస్తే పాల దిగుబడి తగ్గకుండా ఉంటుందన్నారు. గోపాలమిత్ర వేచలపు గోవింద పాల్గొన్నారు.



కొరువాడలో పశువులను పరీక్షిస్తున్న పశువైద్యాధికారి నాయుడు

యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

- ఈదురుగాలులకు విరిగిన స్తంభాలు

రావికమతం: మండలంలో ఈదురు గాలులకు విరిగి పడిన విద్యుత్ స్తంభాలను ఆ శాఖ ప్రత్యేక సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. నిలిచిన సరఫరాను పునరుద్ధరించారు. మండలంలో బుధవారం సాయంత్రం ఈదురు గాలులు వీచాయి. ఈ గాలులకు గర్నికం, ఆర్.కొత్తూరు, కొట్నాబిల్లి తదితర గ్రామాల్లో ఆరు విద్యుత్ స్తంభాలు విరిగి నేలకొరిగాయి. గర్నికంలో కె.అప్పలనాయుడు షెడ్డుపై స్తంభం పడి స్వల్ప ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిచి పోవడంతో ఏఈ నందన్ సకాలంలో స్పందించారు. ప్రత్యేక సిబ్బందిని రప్పించి బుధ, గురువారాల్లో విరిగిన స్తంభాలు స్థానంలో కొత్తవి వేసి సరఫరాను సరిచేశారు. అధికార్లను, సిబ్బందిని పలువురు అభినందించారు.



యుద్ధ ప్రాతిపదికన సరిచేస్తున్న ప్రత్యేక విద్యుత్ సిబ్బంది



ఈదురు గాలులకు విరిగి పడిన విద్యుత్ స్తంభం

ఆయుర్వేదంలో ఆపరేషన్లు లేకుండా వ్యాధుల నివారణ

కశింకోట: ఆయుర్వేద వైద్య విధానంలో శస్త్ర చికిత్సలు లేకుండా వ్యాధులను తగ్గించవచ్చని కన్నూరుపాలెం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాఖ వైద్యాధికారి టి. శిరీష అన్నారు. మండలంలోని కన్నూరుపాలెం ఆయుర్వేద వైద్యశాలలో గురువారం రోగులకు ఆయుర్వేద వైద్యంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిడ్నీలో రాళ్లు, సైనసైటిస్, టాన్సిలైటీస్, వెన్ను సమస్యలు, సయాటిక, ఆనెలు, మొలలు, వెరికోజ్ సిస్ తదితర వ్యాధులను శస్త్ర చికిత్సలు అవసరం లేకుండా తగ్గించవచ్చునన్నారు. జలుబు, దగ్గు, గొంతునొప్పి,తలనొప్పి, అజీర్ణం, అతిసారం, గ్యాస్, గాయాలు నివారణకు చికిత్స అందించి ఉచితంగా మందులు అందించనున్నట్లు తెలిపారు. దీర్ఘకాలికమైన కీళ్ల వాతం, మెకాళ్ల నొప్పులు, పక్షవాతం, చర్మ వ్యాధులు, ఆస్తమా, ఎలర్జీ, మహిళల వ్యాధులు, బొల్లి, నరాలు, కండరాల వ్యాధులకు చికిత్స, మందులు ఉన్నాయన్నారు. తల్లి, పిల్లలు, గర్భిణులకు వైద్యం అందిస్తామన్నారు. ఆరోగ్యవంతంగా ఉండటానికి యోగా, ధ్యానం ఆచరించాలన్నారు. ఇందు కోసం ఇన్‌స్ట్రక్టర్లను నియమించారని, వారు దీనిపై అవగాహన కలిగించి శిక్షణ ఇస్తున్నారన్నారు.



ఆయుర్వేద వైద్యం గురించి అవగాహన కలిగిస్తున్న వైద్యాధికారి శిరీష

అక్రమ మద్యం స్వాధీనం

ఎస్.రాయవరం : అడ్డురోడ్డు మద్యం దుకాణం సమీపంలో వ్యక్తి వద్ద 20 మద్యం బాటిళ్లు ఉన్నట్టు గుర్తించి అదుపులోనికి తీసుకున్నామని ఎస్ఐ విభీషణరావు తెలిపారు. పరిమితికి మించి మద్యం సీసాలు కొనుగోలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు కట్

- డ్వాక్రా, రైతు రుణాలు మాఫీలో చంద్రబాబు మోసం
- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ధ్వజం
- మల్లాం, భీమవరం, శివరాంపురం, నీలకంఠాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

బుచ్చెయ్యపేట: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నింటినీ ఆపేస్తారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన మండల శివారు మల్లాం, ఆర్. భీమవరం, ఎం.బి.పాలెం, శివరాంపురం, నీలకంఠాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. గ్రామగ్రామాన ఆయనకు ప్రజలు పూలవర్షం కురిపించి బ్రహ్మరథం పట్టారు. జై జగన్.. జైజై ధర్మశ్రీ అంటూ నినాదాలు హోరెత్తాయి. మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికీ ధర్మశ్రీ తిరిగారు. సంక్షేమ పథకాల గురించి వివరించారు. గత టీడీపీ పాలనపై విరుచుకుపడ్డారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 14 ఏళ్ల పాలనలో ప్రజల కోసం ఒక్క సంక్షేమ పథకాన్నైనా అమలు చేశారా? అని ప్రశ్నించారు. 2014లో ఇబ్బడిముబ్బడిగా హామీలిచ్చి ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. రైతు, డ్వాక్రా రుణాలు మాఫీ చేయకుండా మోసం చేశారని ఆరోపించారు. ఇంటికో ఉద్యోగం ఇవ్వలేకపోయిన చంద్రబాబు కనీసం నిరుద్యోగ భృతి అమలు చేయలేక చేతులెత్తేశారని ధ్వజమెత్తారు. అరకొరగా ఇచ్చిన పథకాలను సైతం టీడీపీ నాయకులు, వారి అనుయాయులు జేబులు నింపుకోవడం కోసం పనికొచ్చాయని దుయ్యబట్టారు. నీరు – చెట్టు పేరుతో చెరువులను ధ్వంసం చేశారని, ఉపాధి హామీ నిధులను దుర్వినియోగం చేశా రని విమర్శించారు. యంత్రాలను చెరువులను తవ్వించి వేలాది మంది ఉపాధి కూలీల పొట్ట కొట్టారని వాపోయారు. ప్రజా సేవే పరమావధిగా భావించే నాయకులు నిత్యం ప్రజల్లోనే ఉంటారని, పదవుల కోసం పాకులాడే వారు ఎన్నికల సమయంలో మాత్రం కనిపిస్తారని ఆరోపించారు. తాను బీఎన్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తే, పనులు చేయకుండా అడ్డుకున్నదెవరో ఈ ప్రాంత ప్రజలకు తెలుసన్నారు. తనకు నియోజకవర్గ ప్రజల క్షేమమే ముఖ్యమన్నారు. ముఖ్యమంత్రి జగనన్న పాలనలో పేదల సంక్షేమం కోసం అమ్మఒడి, రైతు భరోసా, చేయూత, ఆసరా, సున్నావడ్డీ, విద్యా, వసతి దీవెన తదితర సంక్షేమ పథకాలు అందించారన్నారు. గ్రామాల్లోనే సచివాలయాలు, ఆర్బీకేలు, అంగన్‌వాడీ, ఆస్పత్రి తదితర భవనాలు నిర్మించి మెరుగైన సేవలందిస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రతి నెలా ఒకటో తేదీన అందించే పింఛన్ సొమ్ముతోపాటు బియ్యం సరఫరా నిలిచిపోతుందన్నారు. టీడీపీ నాయకులకు పేదలు సంతోషంగా ఉంటే చూడలేరని, వారికి జేబులు నింపే పథకాలపైనే దృష్టి సారిస్తారని విమర్శించారు. ప్రస్తుత సంక్షేమ పథకాలన్నీ యథావిధిగా కొనసాగాలంటే మరలా వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు. నియోజకవర్గ పరిశీలకుడు శరగడం చిన అప్పలనాయుడు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, సర్పంచ్‌లు నాయకులు బర్ల శివ, నమ్మి అప్పలరాజు, అమ్ము నాయుడు, పడాల నాగభూషణం పాల్గొన్నారు.



మల్లాంలో ఎన్నికల ప్రచారంలో ఓటు అభ్యర్థిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



శివరాంపురంలో ఎన్నికల ప్రచారంలో సమస్యలు తెలుసుకుంటున్న విప్ ధర్మశ్రీ

పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

చోడవరం: గంథవరం ఎమ్మెల్యే ధర్మశ్రీ ఎన్నికల ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తొలుత ఆయన ఇక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రచారంలో పెద్ద సంఖ్యలో యువకులు, మహిళలు నీరాజనం పలికారు. పూలవర్షం కురిపించి, అడుగడుగునా హారతులు పట్టారు. ప్రతీ కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం ద్వారా ఆ కుటుంబం పొందిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను ధర్మశ్రీ వివరించారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలిచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అన్నారు. ప్రజలను ఇబ్బందులు పెట్టి వారి జీవితాలతో ఆడుకోవడం టీడీపీ నాయకులు అలవాటేనని ధ్వజమెత్తారు. గంథవరంలో ప్రధాన సమస్యలన్నీ పరిష్కరించామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ధర్మశ్రీ అభ్యర్థించారు. డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, మాజీ ఎంపీటీసీ మొల్లి ప్రసాద్, మాజీ సర్పంచ్ మొల్లి రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు మొల్లి చిన అప్పలనాయుడు పాల్గొన్నారు.



గంథవరం ప్రచారంలో పాల్గొన్న మహిళలు, యువకులు

చిరుధాన్యాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రఫీ

అనకాపల్లి: వ్యాపారాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే చిరుధాన్యాలపై అవగాహన, ఆసక్తి పెంచుకోవాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ మిల్లెట్స్ రిసోర్స్ సెంటర్ హైదరాబాద్ శాస్త్రవేత్త డాక్టర్ డి.రఫీ అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల వ్యాపారాభివృద్ధి అనే అంశంపై మండలంలో తుమ్మపాల ఎస్‌వీడీఎస్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి వ్యక్తి చిరుధాన్యాలపై ఆసక్తిపెంచుకున్నట్టు ఆయన తెలిపారు. రైతులు మెట్టప్రాంతాల్లో చిరుధాన్యాలు పండించేందుకు ఎక్కువగా మక్కువ చూపుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీడీఎస్ వ్యవస్థాపకులు కాండ్రేగులు జోగినాయుడు, రైతులు పాల్గొన్నారు.